క్లుప్తంగా

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



ఆత్మకూర్: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారికి ఆత్మకూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, రవికుమార్ దంపతులు వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దంపతులు రూ.55 వేలు విలువ చేసే కిరీటాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేసి అమ్మవారికి అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ దంపతులను సత్కరించి ఆశీర్వదించారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాలలో గోజురియో కరాటే అండ్ కిక్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీలో చిట్యాల గ్రామానికి చెందిన 18 మంది విద్యార్థులు పాల్గొని అర్హత సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను గ్రామస్తులు నరసింహ, వెంకటయ్య, నరహరి, వెంకటేష్, రేణుక అభినందించారు. విద్యార్థులకు గోజురియో కరాటే అధ్యక్షుడు కరాటే మాస్టర్లు శేఖర్, వరుణ్ అభినందిస్తూ బెల్టులు ప్రదానం చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



అమరచింత: చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.290 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమని పట్టణంలోని చేనేత సహకార సంఘం ఎదుట చేనేత కార్మికులు దేవరకొండ లచ్చన్న, మహంకాళి విష్ణు, వగ్గు రామలింగం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు అభయహస్తం పథకం ద్వారా నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా పథకాలను ప్రవేశపెట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, పారుపల్లి సత్యన్న, పారుపల్లి శ్రీనివాసులు, రవి తదితరులు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



కొత్తకోట రూరల్: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని పెద్దమందడి మండల వ్యవసాయ అధికారి సైదులయ్య అన్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరి మొలకలు విత్తిన 15 రోజుల తర్వాత గుళికలు వేయడం ద్వారా పంటపై వచ్చే తెగుళ్లను నివారించవచ్చన్నారు. తెగుళ్ల నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ తండాకు చెందిన చంద్రునాయక్, బావుడా నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పుల్లారావు పరామర్శించి, ఒక్కొక్కరికి రూ.7,500 చొప్పున నగదు అందజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, అరుణ్ సహకారంతో బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజుగౌడ్, కృష్ణ, శాలిమియా, బాలకృష్ణ, తండావాసులు పాల్గొన్నారు.

అధ్వానంగా సర్వీస్ రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- భారీ వాహనాలు, చెరుకు ట్రాక్టర్లు పట్టణంలోకి రావడంతో ట్రాఫిక్ కష్టాలు



హైదరాబాద్ వైపు వెళ్లే హైవే పక్కన గల సర్వీస్ రోడ్డు



కొత్తకోట నుంచి కర్నూల్ వైపు వెళ్లే ఎన్‌హెచ్44 రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు

కొత్తకోట రూరల్: జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. సుమారు 20 ఏళ్ల పాటు రోడ్ల నిర్వహణ చేపట్టిన కంపెనీల నిర్లక్ష్యం కారణంగా సర్వీస్ రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. హైదరాబాద్ వైపు నుంచి మదనాపురం, ఆత్మకూర్ వైపు వెళ్లే వాహనాలు సర్వీస్ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో కొత్తకోట పట్టణంలోకి రావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా పట్టణంలో మదనాపురం రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో వాహనాల రద్దీ కారణంగా నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది.

చెరుకు ట్రాక్టర్లతో ట్రాఫిక్ అంతరాయం

నర్వ, ఆత్మకూర్, అమరచింత మండలాల్లో చెరుకు సాగు ఎక్కువగా ఉంటుంది. కొత్తకోట మండలం అప్పరాల సమీపంలో గల కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు ట్రాక్టర్లు రోజు పదుల సంఖ్యలో వస్తుంటాయి. కర్నూల్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు చెట్లు, గుంతలమయంగా మారడంతో చెరుకు ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలు కాకపోవడంతో పట్టణంలోకి రావడంతో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తకోట పట్టణంలోకి రాక ముందు ఉండే సర్వీస్ రోడ్డును సరిచేస్తే చెరుకు ట్రాక్టర్లతో పాటు భారీ వాహనాలు నేరుగా హైవేపైకి వెళ్తాయి. వర్షాకాలం వస్తే సర్వీస్ రోడ్లపై మనుషులు సైతం నడవలేని పరిస్థితి నెలకొంటుంది. సర్వీస్ రోడ్లను బాగుచేయాలంటూ స్థానికులు పలుమార్లు హైవే అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు నిర్వహణ చేపట్టిన సదరు కంపెనీలపై పర్యవేక్షణ చేపట్టినప్పుడే నిర్వహణ సక్రమంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మరమ్మతు నిర్వహించాలి



రహదారి సర్వీస్ రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనాలు ప్రయాణించడం కష్టంగా ఉంది. చెరుకు ట్రాక్టర్లు, భారీ వాహనాలు పట్టణంలోకి రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే సర్వీస్ రోడ్లకు మరమ్మతు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

– భీమన్ననాయుడు, కానాయపల్లి

అధికారులు స్పందించాలి



సర్వీస్ రోడ్లను బాగు చేయాలని గతంలో ఎన్నోసార్లు హైవే అధికారులకు ఫిర్యాదు చేశాం. నేటికీ పట్టింపే లేదు. జాతీయ రహదారుల నిర్వహణ చేపట్టిన కంపెనీలపై రహదారుల నిర్వహణ పర్యవేక్షణ ఉండాలి. పర్యవేక్షణ లేకపోవడంతో కంపెనీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు సర్వీస్ రోడ్లపై దృష్టి సారించాలి.

– వేముల శ్రీనివాస్‌రెడ్డి, కొత్తకోట

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని సీహెచ్‌ఓ రామయ్య వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన మండలంలోని వెంగళాయిపల్లి, జమ్మాపూర్ సబ్ సెంటర్ల పరిధిలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులకు వ్యాక్సినేషన్ చేసి, ఐరన్, కాల్షియం మాత్రలు, అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని ఆయన సిబ్బందికి సూచించారు. గర్భిణులకు రక్తశాతం పెరగడానికి ప్రతిరోజు తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్డు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, ఆశా కార్యకర్తలు నాగమణి, అలివేలు పాల్గొన్నారు.



జమ్మాపూర్ సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య

98 శాతం సర్వే పూర్తి

పాన్‌గల్: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే శనివారం వరకు 98 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ గోవిందరావు తెలిపారు. ప్రజా పాలనలో వచ్చిన 13,540 దరఖాస్తుల ఆధారంగా వివరాలను సేకరిస్తూ మొబైల్ యాప్‌లో నమోదు చేశామన్నారు. మిగిలిపోయిన దరఖాస్తుదారుల వివరాలను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారు ఎవరైనా ఉంటే ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు.

బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



ముగ్గులను తిలకిస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 22వ వార్డులో బీజేపీ ఉపాధ్యక్షుడు మోహన్‌సాగర్ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, జిల్లా బీజేపీ మహిళా ప్రధాన కార్యదర్శి కవిత, వార్డు సీనియర్ గోపాల్ హాజరయ్యారు. ఈ పోటీల్లో దాదాపు 40 మంది పాల్గొనగా.. మేఘన మొదటి బహుమతి సాధించగా రూ.3వేలు నగదు, శ్రీదేవికి ద్వితీయ బహుమతి కింద రూ.2వేలు, శ్రీలతకు తృతీయ బహుమతి కింద రూ.వెయ్యి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాము, విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు తరలిన మాలధారులు



అమరచింత: పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న కురుమూర్తిస్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు పట్టణంలోని అయ్యప్ప ఆలయం నుంచి మాలధారులు శనివారం కాలినడకన బయలుదేరారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమం మొట్టమొదటిసారిగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్నందున స్వామివారిని దర్శించుకొని, గిరి ప్రదక్షిణతో కురుమయ్యకు మొక్కులు తీర్చారు. కార్యక్రమంలో మేర్వరాజు, క్యామ భాస్కర్, ఎర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

వీపనగండ్ల: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా ఆవుల నారాయణను నియమించారు. మండల కేంద్రానికి చెందిన నారాయణ బీజేపీలో ఏళ్లుగా నిబద్ధతతో పనిచేయడంతో తనను నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏల్లేని సుధాకర్‌రావు మండల అధ్యక్షుడిగా నియమించారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి పాటుపడతానని నారాయణ తెలిపారు.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

గోపాల్‌పేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో సోమవారం నుంచి మండలంలోని ఏదుట్లలో ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు అంజి, జైపాల్ తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.పది వేలతో పాటు షీల్డులు అందిస్తారన్నారు. క్రీడాకారుల గ్రామాన్ని గుర్తించడానికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఆదివారం డ్రాలు తీస్తారని, తదితర వివరాలకు 96429 84953, 90521 82353 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వడ్డెర ఓబన్నకు ఘన నివాళి



ఆత్మకూర్‌లో వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డెరసంఘం నాయకులు

ఆత్మకూర్: తెల్ల దొరల పాలిట సింహస్వప్నం వడ్డె ఓబన్న అని వడ్డెర సంఘం నాయకులు కొనియాడారు. శనివారం వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకొని స్థానిక గాంధీచౌక్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. అంతకంటే ముందు ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్డెపరమేష్, వడ్డెనర్సింహా, పెద్దరాములు, వెంకటేష్, చిన్నరాములు, వడ్డె నాగాంజనేయులు తదితరులు ఉన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణంలో వడ్డెర ఓబన్న జయంతిని పురస్కరించుకొని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉమ్మడి జిల్లా సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, కురుమూర్తి యాదవ్ మాట్లాడుతూ మొదటి స్వాతంత్ర ఉద్యమానికి పదేళ్ల ముందే బ్రిటిష్ పాలకులను ఎదిరించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. వడ్డెర సామాజిక వర్గానికి రాజకీయంగా ప్రాతినిధ్యం లేదని, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అని ప్రభుత్వం వడ్డెర ఓబన్నను స్వాతంత్ర సమరయోధుడిగా గుర్తించి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. దీంతో పాటు ఆయన పేరు మీద పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులుయాదవ్, ఎస్‌బీసీ కృష్ణయ్యగౌడ్, సత్యంయాదవ్, యూత్ అధ్యక్షుడు నెహ్రూ, రవీందర్‌రెడ్డి, మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..

బీఎస్పీ ఆధ్వర్యంలో..

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబ్బన్న జయంతిని పురస్కరించుకొని శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ దేవరకద్ర అసెంబ్లీ ఇన్‌చార్జీ జనంపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్ని కోరారు. కార్యక్రమంలో శ్రీను, గోపాల్, కృష్ణయ్య, ఆంజనేయులు, ఎర్రన్న, కొండన్న, శ్రీకాంత్, వివేక్, నరేష్, గోపాల్ నాగరాజు, కృష్ణయ్య, పుల్లయ్య తదితులు ఉన్నారు.

సత్తాచాటిన ఆత్మకూర్ జట్టు



ఆత్మకూర్: జనమైత్రి క్రీడా ఉత్సవాల్లో జరిగిన వాలీబాల్ పోటీలో ఆత్మకూర్ జట్టు మొదటి బహుమతిని సాధించి సత్తా చాటారు. ఆరు రోజుల పాటు జిల్లాకేంద్రంలో జరిగిన పోటీల్లో శనివారం సాయంత్రం ఖిల్లాఘనపూర్ జట్టుపై ఆత్మకూర్ జట్టు మొదటి బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ బృందాన్ని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అభినందించి బహుమతిని అందించారు.

14న ఆంజనేయస్వామి రథోత్సవం

ఎర్రవల్లి: మండలంలోని బి.వీరాపురం గ్రామంలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని ఈ నెల 14న అభయ ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవం విజయవంతం చేయాలని వారు కోరారు.

‘ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త’



వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ప్రచార రథం ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వనపర్తి రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా దూరప్రాంతాలకు వెళ్తున్న వారి అవగాహన కోసం వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి ‘ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త’ అనే ప్రచార రథాన్ని ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రచార రథాన్ని డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐ కృష్ణయ్య, ఎస్ఐలు జలంధర్‌రెడ్డి, బాలయ్య జెండా ఊపి ప్రచార రథం ప్రారంభించారు. ఇలాంటి వినూత్న ఆలోచనలతో కార్యక్రమాలు చేపడుతున్న ఎస్ఐ జలంధర్‌రెడ్డిని డీఎస్పీ, సీఐ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి పండుగకు ఊరు వెళ్తే ఇళ్లలో విలువైన వస్తువులు, బంగారం, వెండి, నగదు ఉంచరాదని, వాటిని బ్యాంక్ లాకర్లలో భద్రపరచి వెళ్లాలని సూచించారు. ఊరెళ్తున్నప్పుడు ఇంటి పక్క వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనబడినా, అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే పోలీసులకు, 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లకు సెంటర్ లాక్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

చోరీల నియంత్రణలో భాగస్వాములవ్వాలి



యూనివర్సల్ ఇన్విసబుల్ లాకింగ్‌లను అందిస్తున్న ఎస్ఐ సురేష్‌కుమార్

అమరచింత: ఆలయాలు, మసీదులు, చర్చిల భద్రత కోసం నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని యూనివర్సల్ ఇన్విసబుల్ లాకింగ్ సిస్టమ్ వినియోగించుకోవాలని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం మసీదులు, ఆలయాలు, చర్చిల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తరుచూ ప్రార్థన మందిరాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ముఖద్వారానికి వేసిన తాళాన్ని పగులగొట్టి విలువైన వస్తువులను దోచుకెళ్తున్నారని, వీటిని అరికట్టేందుకు కొత్తగా లాకింగ్ సిస్టమ్ వినియోగంలోకి వచ్చిందన్నారు. వీటిని ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. అదే విధంగా సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జమీరుద్దిన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ట్రోఫీతో పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులు

కొత్తకోట: భారత టెన్నిస్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు జనవరి 8 నుంచి 10వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన పెబ్బేర్ మోడల్ స్కూల్ విద్యార్థులు మధ్యప్రదేశ్ జట్టును ఓడించి కప్ గెలుకున్నారని ప్రిన్సిపాల్ తూర్పింటి నరేష్‌కుమార్ తెలిపారు. జట్టు కెప్టెన్ చరణ్‌తో పాటు సభ్యులు యోగేశ్వర్, అఫ్రోజ్, పరశురాముడు, మహేశ్, సాత్విక్, చందు, గణేశ్, ఫిజికల్ డైరెక్టర్ కమలాకర్, కోచ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నగోపాల్, చిన్నయ్య, విజయలక్ష్మి, డాక్టర్ బుచ్చయ్య, మంగమ్మ, మోసిన్, ఫకీరయ్య, రమేశ్, డాక్టర్ నాగరాజు, వేణు, నర్సింహులు, గంగాధర్ రవికుమార్, ఖదీర్, నాగమణి, సుమిత్ర, హేమలత, అంజనీదేవి, హఫీజ్, సాహిత్య తదితరులు ఉన్నారు.

యువతకు స్ఫూర్తి రఘునాథ్‌రెడ్డి



రఘునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న మహనీయుల స్ఫూర్తివేదిక ప్రతినిధులు

వనపర్తి టౌన్: విద్యార్థిగా ఉన్నప్పుడు కబడ్డీ, రన్నింగ్, లాంగ్ జంప్ మరెన్నో ఆటల్లో బహుమతులు సాధించి 68 ఏళ్ల వయస్సులో సైతం జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎన్నో పథకాలను రఘునాథరెడ్డి సాధిస్తున్నారని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్ అన్నారు. వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన రఘునాథ్‌రెడ్డి వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో నిత్యం వాకింగ్ చేస్తూ సేవా భారతి ఆర్గనైజేషన్ వారి బహుమతి, మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ తెలంగాణ నిర్వహించిన పోటీల్లో 60 ఏళ్ల పైబడిన వారికి నిర్వహించిన 1,500 మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రథమ స్థానం, ఐదు కిలోమీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, మూడు కిలోమీటర్ల వాకింగ్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్ నిర్వహించిన ఆల్ ఇండియా పోటీలో 65 ఏళ్లకు పైబడిన వారికి నిర్వహించిన ఐదు కిలోమీటర్లు నడకలో ప్రథమ స్థానం, ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం కైవసం చేసుకున్నారు.

‘ఆర్టీసీ’ అదనపు వసూలు

కొల్లాపూర్: సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణం నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుతున్నారు. సాధారణ రోజుల్లో కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు టికెట్ ధర రూ.260 కాగా, శనివారం ప్రత్యేక బస్సుల్లో రూ.360 చొప్పున వసూలు చేశారు. దీనిపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. స్పెషల్ బస్సుల పేరుతో అదనపు వసూలు చేయడం ఏంటని ప్రయాణికులు ప్రశ్నించారు. దీనిపై ఆర్టీసీ డీఎం ఉమాశంకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు వచ్చే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం 9 అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే టికెట్ల ధరలు పెంచినట్లు వివరించారు.



కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు స్పెషల్ బస్సు టికెట్

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. కొంతమంది భక్తులు స్వామి వారికి దాసంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఆలయ సిబ్బంది గురునాథ్, ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఇటిక్యాల: మండలంలోని పెద్దదిన్నె వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలలో భాగంగా నాల్గవరోజు వివిధ పూజా కార్యక్రమాలు వేద పండితులు మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.